అసలే ఇరుకు.. ఆపై ట్రాన్స్‌ఫార్మర్

రోడ్డును ధ్వంసం చేస్తున్న దృశ్యం





గల్లీలోకి రాలేక నిలిచిపోయిన అంబులెన్స్

దుండిగల్: అసలే ఇరుకు గల్లీ.. పైగా ట్రాఫిక్ లొల్లి.. అ దారిలో ఒక వాహనం వస్తే ఎదురుగా మరో వాహనం వెళ్లలేని పరిస్థితి.. ఎవరికైనా అపాయం వస్తే కనీసం అంబులెన్స్ కూడా ఆ రోడ్డు గుండా వచ్చే అవకాశం లేదు. అలాంటి రోడ్డులో ఓ వ్యక్తి రోడ్డుపైనే ప్రైవేటుగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నాడు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే.. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట 23వ వార్డులోని గండిగూడం బస్తీలోని పాత శివాలయం రోడ్డులో ఓ వ్యక్తి ప్రైవేటుగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నాడు. మున్సిపాలిటీ నిధులతో నిర్మించిన రోడ్డును ధ్వంసం చేసి మరీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాడు. స్థానికంగా ఉండే ఓ వ్యక్తి అనారోగ్యానికి గురి కావడంతో ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. సదరు ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం కారణంగా అంబులెన్స్ దూరంగా రోడ్డుపైనే ఆగిపోవాల్సి వచ్చింది. దీంతో రోగిని అవస్థలు పడుతూ, నడిపించుకుంటూ అంబులెన్స్ వద్దకు తీసుకెళ్లారు. ఈ విషయంపై విద్యుత్, మున్సిపల్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి వాహనదారులు ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్

భారీలోడ్‌తో వెళ్తూ పక్కకు ఒరిగిన వాహనం



జీడిమెట్ల పారిశ్రామికవాడలో రోడ్డుపైనే పక్కకు ఒరిగిన వాహనం

ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ ఇక్కట్లు

కుత్బుల్లాపూర్: అధికలోడున్న వాహనాల కట్టడిలో ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు. ఉదయం 10: 30 నుంచి సాయంత్రం 4: 30 వరకు భారీ వాహనాల నియంత్రణలో వెసులుబాటు ఉంది. దీంతో పలు వాహనాల్లో సామర్థ్యాన్ని మించి లోడ్ తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా జీడిమెట్ల పారిశ్రామికవాడలో టాటా ఏసీలు మొదలుకొని డీసీఎంల వరకు భారీ లోడుతో వెళ్తూ ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. గతంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ సమస్య ఎదురుకాగా, తాజాగా జీడిమెట్ల సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డు నుంచి రంగా భుజంగా థియేటర్‌కు వెళ్లే రోడ్డులో చోటు చేసుకుంది. ఆ మార్గంలోని కాంట సమీపంలో భారీ లోడుతో వెళ్తున్న ఓ వాహనం పక్కకు ఒరిగిపోయింది. దీంతో ఆ మార్గంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. నిత్యం చలాన్లపైనే దృష్టి సారించే ట్రాఫిక్ పోలీసులు భారీ లోడుతో వెళ్లే వాహనాలను కూడా గుర్తించి కట్టడి చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

శ్మశాన వాటికల స్థలాలకు హద్దులు అవసరం

నిజాంపేట్: హిందూ శ్మశానవాటికలకు కేటాయించిన స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం బీజేపీ ఆధ్వర్యంలో బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాచుపల్లి, ప్రగతినగర్, నిజాంపేట్ అధ్యక్షులు భిక్షపతి యాదవ్, నరేంద్రచౌదరి, ప్రసాదరాజు మాట్లాడుతూ బాచుపల్లి సర్వే నెంబర్ 186లో నిజాంపేట, బాచుపల్లి ప్రాంతాల శ్మశానవాటికలకు చెరో మూడున్నర ఎకరాలు, ప్రగతినగర్ ప్రాంతానికి 3 ఎకరాలను గతంలో అధికారులు కేటాయించారన్నారు. అయితే అధికారులు సరిహద్దులు ఏర్పాటు చేయకపోవడంతో మెజార్టీ హిందువులకు శ్మశానవాటికలు కరువయ్యాయని పేర్కొన్నారు. శ్మశానవాటిక స్థలాలకు కంచె ఏర్పాటు చేయడంతోపాటు గోశాల, హనుమాన్ వ్యాయామశాల ఏర్పాటుకు మరో 2 ఎకరాలు కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి దాసి నాగరాజు, సనాతన ధర్మ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ముదిరాజ్‌ల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ కృషి



అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ముదిరాజ్ కులస్తుల అభ్యున్నతికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ చౌరస్తాలో అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను అసెంబ్లీ సమావేశాల్లో ముదిరాజులను బీసీ–డి నుంచి బీసీ–ఏ లోకి మార్చాలనే ముఖ్యమైన డిమాండ్‌ను ఇప్పటికే ప్రస్తావించాననితెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో ముదిరాజ్ కులస్తుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు చెరువుల్లో లక్షలాది చేపపిల్లలను వదిలిపెట్టామని, అవి ఇప్పుడు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గుమ్మల స్వామి, సభ్యులు కోలా రవీందర్ ముదిరాజ్, గుమ్మడి మధుసూదన్ రాజు, తోడేటి సత్యం ముదిరాజ్, ఆర్.రమేష్ ముదిరాజ్, నరసింహ ముదిరాజ్, ఉమారాణి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘అక్షయ విద్య’ కృషి అభినందనీయం

జగద్గిరిగుట్ట: పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అక్షయ విద్య ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన 20 ల్యాప్‌టాప్‌లను ఎల్లమ్మబండకు చెందిన విద్యార్థులకు డీసీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యనందిస్తే మూడు తరాలకు మేలు జరుగుతుందని, పేదల జీవితాల్లో మార్పుల రావాలంటే అది విద్యతోనే సాధ్యమన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అక్షయవిద్య ఫౌండేషన్ చైర్మన్ టెంటు ప్రసాద్, జోనల్ మేనేజర్ సాయినాథ్, సభ్యులు రాజశేఖర్, విజయకుమార్, గౌతమ్, బాలానగర్ ఏసీపీ గంగారామ్, జగద్గిరిగుట్ట సీఐ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు పనుల నేపథ్యంలో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ లక్ష్మీనారాయణ ఒకప్రకటనలో తెలిపారు.

◆ చిన్న తోకట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సెంట్రల్ ఎక్సైజ్ ఫీడర్ పరిధిలో రాంగోపాల్ ఎన్‌క్లేవ్, మారుతినగర్, సాయిబాబా టెంపుల్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, వైష్ణవి రెసిడెన్సీ, ఎస్‌ఆర్‌ఐ ఎస్సార్ అపార్ట్‌మెంట్స్, సాయి నిలయం, సాయికృష్ణ రెసిడెన్సీ, దుబాయ్ గేట్ ఫీడర్ పరిధిలోని దుబాయ్‌గేట్, కేఆర్‌కే రెసిడెన్సి, స్పెన్సర్స్, మారుతినగర్, రామ్ గోపాల్ ఎంక్లేవ్, ఫ్రూట్స్ గోడౌన్, రామకృష్ణ అపార్ట్‌మెంట్స్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంచవటి కాలనీ ఫీడర్ పరిధిలోని బాపూజీనగర్, భావన కాలనీ, ధనలక్ష్మి కాలనీ, మలాని కాలనీ, ఎస్ఎస్వీ ఫంక్షన్ హాల్, వికాస్ గ్లాస్, పంచవటి కాలనీ, పవిత్ర హాస్పిటల్, బాపూజీనగర్ గేట్, స్టార్ సూపర్ మార్కెట్, పార్క్ వ్యూ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో పార్క్‌వ్యూ ఎన్‌క్లేవ్, గ్రీన్‌వ్యూ ఎన్‌క్లేవ్, ఫరీద్‌నగర్, మనోవికాస్ నగర్, రిలయన్స్ విల్లా మార్ట్, రాయల్ ఎన్‌క్లేవ్, ఎస్‌బీఐ కాలనీ, అరవల్లి ఎంక్లేవ్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారుల సహకరించాలని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

షాపూర్‌నగర్ ఫీడర్ పరిధిలో

జీడిమెట్ల: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జీడిమెట్ల ఏఈ ప్రసూన ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ షాపూర్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంజయ్‌గాంధీ నగర్, ఎస్ఎల్‌బీనగర్, కళావతినగర్, న్యూషాపూర్‌నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

సెయింట్ ఆన్స్ ఫీడర్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో శుక్రవారం సరఫరాలో అవాంతరాలు తలెత్తనున్నాయని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.11కేవీ సెయింట్ ఆన్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11నుంచి సాయంత్రం 4 గంటల వరకు సెయింట్ ఆన్స్ స్కూల్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్,రెవోవా ఆస్పత్రి రోడ్డు, ఎన్‌సీఎల్ సౌత్ కాలనీ,11కేవీ సన్మాన్ బల్మార్ ఫీడర్ పరిధిలో సన్మాన్ విల్లాస్, వైష్ణవి మిడోవ్స్,ఉడ్స్ కాలనీ,యాదిరెడ్డిబండ, సయ్యద్‌నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఏఈ కోరారు.

నేడు, రేపు సైన్స్ ఎగ్జిబిషన్

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ గండిమైసమ్మలోని ఎస్ఎస్‌కేకే హైస్కూల్‌లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు మేడ్చల్ జిల్లా డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22,23 తేదీల్లో రెండు రోజులపాటు ఎగ్జిబిషన్ కొనసాగనుంది. ఇప్పటికే ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనే పాఠశాలల విద్యార్థుల రిజిస్ట్రేషన్ల నమోదు ప్రక్రియ 17వ తేదీతో ముగిసిందని పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో సెలెక్ట్ అయిన విద్యార్థులు తప్పకుండా తమ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, లేనియెడల ప్రాజెక్ట్‌ల ప్రదర్శనకు అనుమతి ఉండబోదన్నారు. జూనియర్ విభాగంలో 6 నుంచి 8వ తరగతి, సీనియర్ విభాగంలో 9, 10 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి: ఏసీపీ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని పేట్‌బషీరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం సూరారంలోని మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో యాంటీ ర్యాగింగ్ రూల్స్, రెగ్యులేషన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫ్రెషర్స్‌తోపాటు దిగువ తరగతుల విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులకు గురిచేయడం వారి జీవితాలపై పెనుప్రభావం చూపుతుందని, ఎందరో ర్యాగింగ్‌ను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూరారం సీఐ భరత్‌కుమార్, మెడికల్ కళాశాల డీన్ వీవీ శాస్త్రి, ర్యాగింగ్ కమిటీ సభ్యులు, అడ్మిన్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దమనకాండను ప్రశ్నిస్తే సీఎంకు వణుకు

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: రైతులపై దమనకాండను ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డికి వణుకెందుకని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మానుకోటలో బీఆర్‌ఎస్ మహాధర్నాకు అనుమతి నిరాకరించిన రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గురువారం ఒక లేఖ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లగచర్లలో రైతుల భూములను ఫార్మాసిటీ పేరుతో అల్లుడి కోసం బలవంతంగా లాక్కుంటున్న విషయాన్ని తమ నాయకుడు కేటీఆర్ ప్రజల్లో ఎండగట్టడంతో సీఎంకు భయం పట్టుకుందన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని,రైతు రాజులా బతకాలని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా, రైతు రుణమాఫీ, రైతుబంధు వంటి పథకాలతో బీఆర్‌ఎస్ అధినేత, అప్పటి సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగగా మార్చారని పేర్కొన్నారు. కానీ, కాంగ్రెస్ 11 నెలల పాలనలో అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయాన్ని దండుగగా మార్చారని విమర్శించారు.

నగరంలో అదృశ్యం.. ఏపీలో ప్రత్యక్షం

మూసాపేట: పాఠశాలకు వెళ్లి అదృశ్యమైన ఇద్దరు విద్యార్థినుల ఆచూకీ గురువారం లభ్యమైంది. పోలీసులు వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన ఓ విద్యార్థిని (13) అదే ప్రాంతానికి చెందిన మరో విద్యార్థిని (13) వివేకానంద నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. ప్రతి రోజు వాళ్ల అమ్మ పాఠశాలకు తీసుకొచ్చి, సాయంత్రం తీసుకువెళ్లేది. బుధవారం ఉదయం పాఠశాలలో దింపి సాయంత్రం తీసుకువెళ్లేందుకు రావడంతో ఎంత సేపైనా బయటకు రాకపోవడంతో స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం రాత్రి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కిడ్నాప్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పాఠశాలలోని తోటి విద్యార్థినులను ప్రశ్నించగా.. ఒక విద్యార్థిని ఊరు ఏపీలోని చీరాల దగ్గరలో ఉన్న ఓ గ్రామం అని, సూర్యలంక బీచ్ గురించి కొన్ని రోజులుగా చెబుతూ ఉండేదని పోలీసుల విచారణలో తేలింది. గురువారం మధ్యాహ్నం పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థినులను గుర్తించి నగరానికి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు



గాంధీనగర్‌లో జరిగిన ఉత్సవంలో పాల్గొన్న కేఎం ప్రతాప్

రంగారెడ్డినగర్: మత సామరస్యానికి ఉర్సు ప్రతీకగా నిలుస్తుందని డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. హెచ్ఎంటీ కాలనీలోని హజ్రత్ జిందాషా మదర్ దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హజరత్ జిందాషా మదర్ రహమతుల్లా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గురువారం గాంధీనగర్‌లో మొహమ్మద్ రియాజ్ ఆధ్వర్యంలో సందల్ ముబారక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాదర్‌ను ప్రతాప్ సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, జాతి ఐక్యతను చాటేవిధంగా ఉండాలన్నారు. హజ్రత్ జిందాషా మాదర్ దర్గా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షుడు షేక్ బాబుమియా, దర్గా కమిటీ సభ్యులు జలీల్‌ఖాన్, గౌస్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ బిక్స్ సంచాలకులు ప్రొఫెసర్ వెంకటేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. రోజు రోజుకు యూనివర్సిటీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారిందన్నారు. స్పందన బ్లాక్ చుట్టు పక్కల, క్యాంటిన్ పరిసరాల్లో, క్యాంపస్ 2వ గేట్ వద్ద, కిన్నెర, మంజీరా వసతి గృహం వెనుక భాగంలో డ్రైనేజీ నీరు పొంగి బయటకు వస్తుండటంతో దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఇండియన్ ఫొటో ఫెస్టివల్ షురూ

మాదాపూర్: ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఫొటో ఫెస్టివల్ 2024ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది ఒక ఆర్ట్ అని పెయింటింగ్ కంటే క్లిష్టమైనదన్నారు. ఫొటోగ్రాఫర్‌లు కెమెరాలలో అద్భుతమైన చిత్రాలను బంధించి మధుర జ్ఞాపకాలను అందిస్తున్నారన్నారు. హైదరాబాద్ ఎంతో అద్భుతంగా ఉంటుందని ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ఆకట్టుకుంటాయన్నారు. కాగా, ఫొటో ఫెస్టివల్ 10వ ఎడిషన్‌ను జనవరి 5వ తేదీ 2025 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఫిల్మ్‌మేకర్ సబీనా గాడిహోక్, ప్రొఫెసర్ జామియా, ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ అమితాదేశాయ్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.



నిర్మాణాలకు అనుమతులివ్వకుంటే సహించం

ఎమ్మెల్యే వివేకానంద్



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: వక్ఫ్‌బోర్డు స్థలాల బూచి చూపెట్టి ప్రైవేట్ స్థలాల్లోనిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గాజులరామారం డివిజన్ పరిధిలో ఇంటి నిర్మాణాల అనుమతుల విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారులు నిబంధనలను పాటించడంలేదని, వక్ఫ్, దేవాదాయ శాఖల పేరు చెప్పి అనుమతులు ఇవ్వకుండా దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ విషయమై కోర్టు ఉత్తర్వులు జారీచేసినా వాటిని పాటించడంలేదని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, ఏసీపీ రమేష్, టీపీఎస్ తుల్జాసింగ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులపై సమీక్ష

గాజులరామారం సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీల్లో నిర్మాణదశ, పెండింగ్ పనులపై ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆరా తీశారు. పెండింగ్ పనులపై వెంటనే దృష్టి సారించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఈ శిరీష, ఏఈలు కళ్యాణ్, తిరుపతి, ఇంజనీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

23న భగవద్గీత కంఠస్థ పోటీలు

కుత్బుల్లాపూర్: ఈ నెల 23వ తేదీన కుత్బుల్లాపూర్‌లోని వేణుగోపాలస్వామి దేవాలయంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్య నరేంద్ర కృష్ణ పసుపులేటి ఒక ప్రకటనలో తెలిపారు. పరిషత్ ఆధ్వర్యంలో డిసెంబర్ 11వ తేదీన గీతా జయంతిని పురస్కరించుకొని ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఆరో అధ్యాయం ఆత్మ సంయోగంపైన పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆరు, ఏడు తరగతులు మొదటి గ్రూపు, 8, 9 తరగతులు రెండో గ్రూపు, సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకములు 18 సంవత్సరాలలోపు వారికి మూడో గ్రూపు, 18 సంవత్సరాలు పైబడిన వారికి నాల్గవ గ్రూపుగా విభజించామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతి పాఠశాల నుంచి ఎంతమంది విద్యార్థులైనా పాల్గొనవచ్చని, ఇతర వివరాలకు ఫోన్: 90300 00964లో సంప్రదించాలని సూచించారు.

23న వీజేఐఎం 30వ స్నాతకోత్సవం

నిజాంపేట్: విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(వీజేఐఎం) 30వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 23న బాచుపల్లి క్యాంపస్‌లో నిర్వహించనున్నామని ఆ కళాశాల అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్టీఐ మైండ్ ట్రీ అధ్యక్షుడు సుధీర్ చతుర్వేది హాజరుకానున్నారని పేర్కొన్నారు. యూకే టెక్ రంగంలోని టాప్–100 అత్యంత ప్రభావశీలురుల్లో ఒకరిగా చతుర్వేది గుర్తింపు పొందారన్నారు. ఈ స్నాతకోత్సవంలో విజ్ఞానజ్యోతి ఉపాధ్యక్షుడు కోడె దుర్గాప్రసాద్, విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ హరిశ్చంద్ర ప్రసాద్, విజ్ఞానజ్యోతి సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

శ్రీశైలంగౌడ్‌కు కృతజ్ఞతలు



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న బిల్డర్లు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సర్వే నెంబర్ 58 నుంచి 226 వరకు గల స్థలాల రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్‌కు పలువురు బిల్డర్లు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్‌బోర్డు స్థలాల నెపంతో సర్వే నెంబర్ 58 నుంచి 226 వరకు గత కొద్దికాలంగా రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. అయితే రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని కోరుతూ పద్మనగర్ ఫేజ్– 2 కాలనీకి చెందిన పలువురు గతంలో కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా షాపూర్‌నగర్‌లో ఆయనను బిల్డర్లు, కాలనీవాసులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అప్పారావు, దుర్గారావు, ఓబుల్ రెడ్డి, హర్ష, సత్యనారాయణ, రంగారావు, రాజనాల శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, వెంకన్న, వెంకటరత్నం, రాజీవ్, వెంకటేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



పేట్‌బషీరాబాద్‌లో జేసీబీతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రహమాన్‌ఖాన్ హెచ్చరించారు. ప్రభుత్వ స్థలంలో వెలసిన పలు నిర్మాణాలను తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి పోలీసు భద్రత మధ్య గురువారం కూల్చివేశారు. జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని సర్వే నంబర్ 25/1లో హెచ్ఎండీఏ స్థలంలో ఓ వ్యక్తి నిర్మాణాలు చేపట్టగా సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు రెండు గదులను పోలీసు భద్రత మధ్య కూల్చివేశారు. జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్ స్థలంలో నిర్మించిన గదిని కూడా నేలమట్టం చేశారు.

రోడ్డుపై అడ్డదిడ్డంగా చెట్లకొమ్మలు



మధురనగర్ ప్రధానరోడ్డులో రాకపోకలకు అడ్డుగా మారిన చెట్ల కొమ్మలు

నిజాంపేట్: రోడ్డుపై అడ్డదిడ్డంగా పడేసిన చెట్లకొమ్మల వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్ 26వ డివిజన్ పరిధిలోని మధురనగర్ మెయిన్ రోడ్డు, రాజీవ్ గృహకల్ప రహదారుల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను ఇటీవల ఆ శాఖ అధికారులు తొలగించారు. అయితే వాటిని తరలించకుండా రోడ్డుపైనే ఉంచడంతో స్కూల్ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది స్పందించి చెట్లకొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



నిజాంపేట్: అనుమతులు లేని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో నిజాంపేట్ కమిషనర్ సాబేర్ అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ చూసినా ఇబ్బడిముబ్బడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, అనుమతి లేకుండానే నాలుగైదు అంతస్తులు చేపడుతున్నారని పేర్కొన్నారు. నిజాంపేట్ సర్వే నెంబరు 90, 94లలో జరుగుతున్న అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశీ యాదయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.